క్లుప్తంగా

గర్భాశయ కణితులను నిర్లక్ష్యం చేయవద్దు


డాక్టర్ వసంత దాసరి

అక్కిరెడ్డిపాలెం: మహిళలు గర్భాశయ కణితులను నిర్లక్ష్యం చేయవద్దని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజిస్ట్ డాక్టర్ వసంత దాసరి అన్నారు. ఆస్పత్రిలో సోమవారం గర్భాశయ కణితిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భాశయ కణితి క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, నిరోధించడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. గర్భాశయ క్యాన్సర్ ప్రారంభ దశలోఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు అన్నారు. స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ వ్యాధి కట్టడికి కీలకం అని చెప్పారు.

గెడ్డలో పడి వృద్ధుడి మృతి


పోతురాజు (ఫైల్)

పెదగంట్యాడ: గెడ్డలో పడి ఓ వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నడుపూరు శెట్టిబలిజ వీధిలో బత్తిన పోతురాజు (59) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. కల్లు గీసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అన్ సీజన్ కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. అప్పుడప్పుడు సమోసా దుకాణంలో ఉల్లిపాయలు కోసేందుకు వెళ్తుంటాడు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం కూడా వెళ్లాడు. తిరిగి వస్తుండగా గెడ్డ ఒడ్డున మూత్ర విసర్జన చేస్తుండగా ఒక్కసారిగా తూలి పడిపోయాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో సుమారు రెండు గంటల పాటు గెడ్డలోని మృత్యువుతో పోరాడి చివరకు చనిపోయాడు. గెడ్డలో వృద్ధుడిని చూసిన ఓ వ్యక్తి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై న్యూపోర్టు పోలీసులను సంప్రదించగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఏయూ విద్యార్థులు


విద్యార్థిని అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: న్యూ ఢిల్లీలో జనవరి 26వ తేదీన నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకలకు ఇద్దరు ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ఆహ్వానం అందింది. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో బీబీఏ చదువుతున్న డి.బుచ్చయ్య నాయుడు, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో చదువుతున్న డి.హర్షిత ఈ వేడుకల్లో ఆహ్వానితులుగా పాల్గొంటున్నారు. వీరు తమ తల్లిదండ్రులతో కలిసి గణతంత్ర దినోత్సవాన్ని వీక్షించడానికి న్యూఢిల్లీ వెళ్లనున్నారు. వారిని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

అల్లిపురం : విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,500 కోట్లు తాత్కాలిక ఉపశమనమే తప్ప దీర్ఘకాలంలో ప్రయోజనం లేదని ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు అన్నారు. పూర్తి సామర్థ్యంతో మునుపటి వలే ప్రభుత్వ రంగ సంస్థగా మనుగడ సాగించాలంటే సొంత గనులు కేటాయించాలని ఆయన సోమవారం డిమాండ్ చేశారు. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. ప్లాంట్‌లో ఉత్పత్తి మెరుగుపడాలంటే ఖాళీగా ఉన్న 5 వేలు పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉక్కు సంకల్పం

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం విభిన్న వేషధారణల్లో నిరసన

ప్రైవేటీకరణ జరిగితే అనర్థాలపై తన పాత్రల ద్వారా వెల్లడి
ఉక్కు ఉద్యమంలో కీలక భూమిక పోషిస్తున్న ఉద్యోగి బిషాయ్


మహిళా గర్జనలో...

ఆంధ్రుల హక్కు– విశాఖ ఉక్కు అనే నినాదంతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి కార్మికులు పోరాటం కొనసాగిస్తున్నారు. నిరాహార దీక్షలు.. రాస్తారోకోలు.. నిరవధిక దీక్షలు చేస్తున్నారు. ఉక్కు సంకల్పంతో ఉద్యమిస్తున్నారు. అన్ని వర్గాల మద్దతు కూడగడుతున్నారు. అలాంటి పోరాటంలో కీలక భూమిక పోషిస్తున్నారు ఉక్కు ఉద్యోగి బిషాయ్. కళా రంగంలో ఉన్న ప్రావీణ్యంతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే తలెత్తే అనర్థాలను **వివిధ వేషధారణల్లో వివరిస్తున్నారు. పోరాటానికి మరింత స్ఫూర్తి నింపుతున్నారు.** – ఉక్కునగరం


డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌గా...

1987లో జూనియర్ ట్రైనీగా..

ఒడిశా **రాష్ట్రానికి చెందిన పరమానంద బిషాయ్ 1987 జులైలో స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీగా** చేరారు. 14 ఏళ్లు స్టీల్ మెల్ట్ షాప్‌లో పనిచేసిన బిషాయ్ ఆ తర్వాత టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. మొదట నుంచి నాటక రంగంపై ఆసక్తి ఉన్న బిషాయ్ ఉక్కునగరంలోని పలు సంస్థలకు చెందిన నాటికల్లో వివిధ పాత్రలు పోషించారు. అయితే 2021 జనవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకంపై ప్రకటన చేయడంతో ఉక్కు ఉద్యోగులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ప్లాంట్‌ను కాపాడుకునేందుకు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టారు. దీనిలో కళాకారుడిగా బిషాయ్ పోరాటం చేయడంతో పాటుఆందోళనల్లో గళమెత్తడంతో పాటు వివిధ వేషధారణలతో నిరసన వ్యక్తం చేస్తున్నారు.


బిచ్చగాని పాత్రలో బిషాయ్


మొక్కజొన్నలు అమ్ముకునే వ్యక్తిగా..

121 వేషధారణల్లో వినూత్నంగా నిరసన

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఇప్పటి వరకు 121 వేషాలతో బిషాయ్ నిరసన తెలిపారు. ప్రైవేటీకరణపై మహనీయులు, మేధావుల, జాతీయ నాయకుల అభిప్రాయాలు, ప్రైవేటీకరణ జరిగితే స్టీల్‌ప్లాంట్ కార్మికుల పరిస్థితులపై వేషధారణలతో ఉద్యోగులను, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే ఉద్యోగులు బిచ్చగాళ్లుగా మారుతారని చెప్పే బిచ్చగాని వేషంతో తన పోరాటం మొదలు పెట్టారు.


బిర్సాముండాగా..

చైతన్య పరచడమే లక్ష్యం



దేశంలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల ఆయా సంస్థల ఉద్యోగులు పడుతున్న కష్టాలు, నష్టాలు మనం చూస్తున్నాం. అదే పరిస్థితి విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు రాకూడదనే ఆకాంక్షతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టాను. ప్రజలను, ఉద్యోగులను చైతన్య పరచడం ద్వారా వారిని ఉక్కు ఉద్యమంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను.
– పరమానంద బిషాయ్, స్టీల్‌ప్లాంట్ కార్మికుడు

బడుగులకు కష్టాలే..

ప్రైవేటీకరణ జరిగితే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల పరిస్థితిపై అంబేడ్కర్, పూలే, బిర్సాముండాల వేషధారణలు కట్టారు. ఎస్టీలు మరలా పాత జీవితంలోకి వెళ్లాల్సి వస్తుందన్న వేషధారణలో నిరసన తెలిపారు. ప్రైవేటీకరణ జరిగితే కార్మికులు రోడ్డున పడి కాయగూరలు, మొక్కజొన్నలు అమ్ముకోవాల్సి వస్తుందని మొక్క జొన్నలు విక్రయిస్తూ నిరసన తెలిపారు.

విశాఖ ఉక్కుపై గద్దల కన్ను

దివంగత అమృతరావు అమరణ దీక్షతో ఏర్పడిన విశాఖ ఉక్కుపై కార్పొరేట్ గద్దల దృష్టి పడిందని చెబుతూ.. వారి వల్ల యాజమాన్యం జీతాలు నిలిపి వేయడంతో ఉక్కు ఉద్యోగులు దసరా, దీపావళి వంటి పెద్ద పండగలు పస్తులతో జరుపు కోవాల్సి వచ్చిందని, ప్రైవేటీకరణ నిలిపి వేయాలని హరిదాసు వేషధారణలో నిరసన తెలిపారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

గాజువాక: వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తహసీల్దార్ శ్రీవల్లి, జోనల్ కమిషనర్ శేషాద్రి సూచించారు. గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)సోమవారం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు, ప్రభుత్వ విభాగాధిపతులు పాల్గొన్నారు. గాజువాక మండల పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడు ప్రధాన సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందాయి. 22ఏ జాబితాలో నమోదైన ప్రైవేట్ భూములకు విముక్తి కల్పించాలని, వినాయకనగర్ వుడా కాలనీలో అబ్దుల్ కలామ్ పార్కు స్థలం ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కోరుతూ వినతి పత్రాలు అందినట్టు గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి తెలిపారు. ఆ స్థలంలో పార్కు నిర్మించేందుకు జీవీఎంసీ రూ.30లక్షలు మంజూరు చేసిందని అండిబోయిన లక్ష్మి, గొరుసు సత్యం, సత్యనారాయణ తదితరులు వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ రెవెన్యూ అధికారి సీహెచ్.రామనారాయణ, గాజువాక పీహెచ్‌సీ సీహెచ్‌వో నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

మహారాణిపేట: గాజువాక దరి భానోజీతోట సర్వే నెంబర్ 86లో ప్రభుత్వ స్థలం(కొండపోరంబోకు)లో ఇంటి నిర్మాణం శరవేగంగా సాగుతోంది. మొత్తం 350 గజాలు ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నట్టు సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టం(పీజీఆర్ఎస్)లో సామాజిక కార్యకర్త అంబటి రవి ఫిర్యాదు చేశారు. తప్పుడు పత్రాలు చూపించి ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు రవి వివరించారు.

పరసకు పోటెత్తిన భక్తజనం


పూజలందుకుంటున్న ఉమామహేశ్వరుడు


ఆలయం వద్ద భక్తజన సందోహం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు కాపుతుంగ్లాంలో ఉమా రామలింగేశ్వర స్వామి వార్ల పర అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరకుని ఉమామహేశ్వరస్వామిని, సీతారామలక్ష్మణ స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. గ్రామంలో వీధులన్నీ విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్మాయి. పరసను తిలకించడానికి విచ్చేసిన భక్తులతో వీధులన్నీ కిక్కిరిసి పోయాయి. పలు రకాల స్టాళ్లు కొలువు తీరాయి. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. డ్యాన్స్ బేబీడ్యాన్స్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. పరస సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

బహుమతుల అందజేత

జీవీఎంసీ 69వ వార్డు కాపుతుంగ్లాంలో ఉమా రామలింగేశ్వరస్వామి వార్ల పరస మహోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు గ్రామ నాయకుడు కరణం ముత్యాల నాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కంచిపాటి ప్రకాష్, విరోతి రాము, సాలాపు వెంకటరావు, కృష్ణం రాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పరసకు విచ్చేసిన భక్తుల కోలాహలం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముత్యాలనాయుడు

సమన్వయంతో ఉక్కుకు ప్యాకేజీ సాధించాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్ర ప్రజలకు సెంటిమెంట్ అని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు, నిర్వాసితుల మనోభావాలు, కార్మికుల కష్టాలను అర్థం చేసుకొని కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇచ్చిందన్నారు. గాజువాక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీలు సమన్వయంతో ఈ ప్యాకేజీని సాధించామన్నారు. పూర్తిస్థాయి సామర్థ్యంతో ప్లాంట్‌ను రెండేళ్లపాటు నడిపితే సెయిల్‌లో విలీనం చేయడానికి అవకాశం ఉందన్నారు. యాజమాన్యం, కార్మికులు సమన్వయంతో పని చేసి లాభాల బాటలో నడపాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు వచ్చేలా కృషి చేస్తామని, ఇంకా అవసరమైన ఆర్థిక సాయం కోసం ప్రయత్నిస్తానని చెప్పారు. సమావేశంలో కూటమి నాయకులు కోన తాతారావు, బొండా ఎల్లాజీరావు తదితరులు పాల్గొన్నారు.


జయగోపాల్‌కు పెరియార్ అవార్డు సముచితం


మాట్లాడుతున్న భారత నాస్తిక సమాజం నాయకులు శ్రీరామమూర్తి, నూకరాజు

సీతంపేట : నాస్తికవాది, భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్‌కు మరణానంతరం ప్రముఖ సాంఘిక ఉద్యమకారుడు పెరియార్ అవార్డును ప్రకటించడం సముచితమని భారత నాస్తిక సమాజం నాయకులు టి.శ్రీరామమూర్తి, వై.నూకరాజు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చెన్నైలోని ద్రవిడ కజగం, పెరియార్ తమిళ్ ఫోరం ఈ నెల 15న డాక్టర్ కె.వీరమణి చేతుల మీదుగా పెరియార్ అవార్డు అందజేసినట్టు తెలిపారు. 1972లో డాక్టర్ జయగోపాల్ స్థాపించిన భారత నాస్తిక సమాజం దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో మూఢనమ్మకాల నిర్మూలన, హక్కుల సాధనకై కృషి చేసిందన్నారు. దళితులపై, స్త్రీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, మానవహక్కుల పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా పెరియార్ అవార్డు దక్కిందన్నారు. సీపీఐ నాయకుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ పెరియార్ అవార్డుకు జయగోపాల్ అన్నివిధాలా అర్హుడన్నారు. సమావేశంలో నాస్తిక సమాజం నాయకులు జె.రవి, జె.శ్యామల, జె.సునీత, రాంప్రభు, విజ్ఞానంద్ పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీసీపీ–2 మేరీ ప్రశాంతి


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ - 2 మేరీ ప్రశాంతి

మర్రిపాలెం : గత ఏడాది నవంబర్ 29న ఊర్వశి జంక్షన్ దరి ఐటీఐ కూడలి వద్ద ఆర్టీసీ బస్సులో మహిళపై దాడికి పాల్పడింది ఓ యాచకుడని, అలాగే అతడు ఉపయోగించింది యాసిడ్ కాదని బాత్రూమ్‌లు శుభ్రపరిచే (తక్కువ మోతాదులో ఉన్న కాన్సన్‌ట్రేటెడ్ హైడ్రోక్లోరిక్ యాసిడ్) రసాయనమని డీసీపీ –2 మేరీ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఘటనకు సంబంధించిన వివరాలు సోమవారం కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఆమె వెల్లడించారు. ఐటీఐ జంక్షన్ వద్ద గోపాలపట్నం నరసింహనగర్ ప్రాంతానికి చెందిన ఓ యాచకుడు బస్సు దిగి బయట నుంచి మహిళపై యాసిడ్ పోసి వెళ్లి పోయినట్టు పోలీసులకు ఫిర్యాదు అందిందని తెలిపారు. మహిళ వెనుక ఉన్న వారిపై కూడా ఆ ద్రావకం చుక్కలు పడినట్టు ఆమె వెల్లడించారు. అయితే అప్పుడు యాసిడ్ దాడి జరిగినట్టు బాధితులు చెప్పడంతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పందించి విచారణకు ఆదేశించారని, మొత్తం 21 ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టామని తెలిపారు. యాసిడ్ దాడి జరిగినట్టు ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. అన్ని విధాలుగా విచారించామని, నిందితుడికి, బాధితులకి మధ్య కక్షలు, గొడవలు ఉన్నట్టు కనిపించలేదని ఆమె స్పష్టం చేశారు. ఘటనా స్థలంలోని సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించామని, సదరు యాచకుడు గోపాలపట్నం ప్రాంతానికి చెందిన వెంకట శ్రీనివాస్‌గా గుర్తించామని తెలిపారు. సదరు యాచకుడు తరచూ 28వ నంబర్ ఆర్టీసీ బస్సులో రాకపోకలు సాగిస్తుంటాడని, ఈ క్రమంలో టికెట్ తీసేందుకు నిరాకరిస్తుంటాడని... ఆ క్రమంలోనే బస్సు కండక్టర్, డ్రైవర్ మీద కాన్సన్‌ట్రేటెడ్ హైడ్రోక్లోరిక్ యాసిడ్ పోసేందుకు ప్రయత్నిస్తే... అది మహిళపై పడినట్టు అంచనా వేసినట్టు ఆమె తెలిపారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. సమావేశంలో ద్వారకా జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఎస్ఐలు సమీర్, దివ్యభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

తిప్పల దేవన్‌రెడ్డికి అభినందనలు



దేవన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న 75వ వార్డు నాయకులు,పల్లా చినతల్లి తదితరులు

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ 75వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగిరెడ్డి, సుమన్‌రెడ్డి సోమవారం దేవన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా చినతల్లి, నాయకులు పల్లా పెంటారావు, అచ్చంనాయుడు, అన్నపూర్ణ, లక్ష్మి తదితరులు దేవన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

లీకులతో నీరు వృథా!


దుగ్గపువానిపాలెం రాజ్యలక్ష్మి అపార్ట్‌మెంట్ సమీపంలో..


లక్ష్మీపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక వీధిలో..

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డులోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ మంచినీటి పైప్‌లైన్ పలు చోట్ల పగిలిపోవడంతో నీరు వృథాగా పారుతోంది. ఆయా ప్రాంతాలకు నీరు విడిచిపెట్టే సమయంలో ఫౌంటైన్ మాదిరిగా నీరు వెదజల్లుతూ రోడ్డంతా చిమ్మడంతోపాటు నీరు వృథాగా పారుతోంది. నెలన్నర నుంచి ఇదే పరిస్థితి ఉంది. ఈ విషయంలో జీవీఎంసీ నీటి సరఫరా సిబ్బంది, అధికారులకు చెప్పినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. దుగ్గపువానిపాలెం ఉప్పరకాలనీ మధ్యలో, అలాగే లక్ష్మీపురం కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుకనున్న ప్రధాన రహదారిలో నెలన్నరగా ఇదే పరిస్థితి కొనసాగుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని లక్ష్మీపురం, దుగ్గపువానిపాలెం, ఉప్పరకాలనీవాసులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటన పెద్ద డ్రామా


నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : ఆంధ్ర రాష్ట్రంలోని ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని సీఐటీయూ అక్కయ్యపాలెం జోన్ కమిటీ నాయకులు జి.అప్పలరాజు, గౌరీష్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటన పెద్ద డ్రామా అని విమర్శించారు. ఇది కూడా ప్రైవేటీకరణలో ఒక భాగమే అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో బయటకు నెట్టేయడం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉక్కు కర్మాగారం కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో చెల్లిస్తోందన్నారు. ఇప్పటికైనా సొంత గనులు కేటాయిస్తే ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నినాదాలు చేశారు.